క్లుప్తంగా

నేడు విద్యుత్ అదాలత్

వాంకిడి: మండల కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో నేడు విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఏఈ శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటల నుంచి నిర్వహించే విద్యుత్ అదాలత్‌లో సమస్యలు పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులకు బిల్లులు, తదితర సమస్యలపై తక్షణ పరిష్కారం లభిస్తుందని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు ఏవో ఈశ్వర్, ఏఏవో తుకారాం, ఏడీఈ శ్రీనివాస్ హాజరుకానున్నట్లు తెలిపారు.

'ఆర్‌ఎంపీలపై దాడులు ఆపాలి'



నిరసన తెలుపుతున్న ఆర్‌ఎంపీలు

దహెగాం: గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న ఆర్‌ఎంపీ, పీఎంపీలపై ఐఎంఏ, టీఎంసీ వారి దాడులను ఆపాలని మండల ఆర్‌ఎంపీల సంఘం అధ్యక్షుడు మధుకర్ అన్నారు. ఆర్‌ఎంపీల రాష్ట్రకమిటీ పిలుపు మేరకు సోమవారం మండల ఆర్‌ఎంపీల సంఘం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఆర్‌ఎంపీ, పీఎంపీలపై దాడులను ఆపి, 1273 జీవోను వెంటనే అమలు చేయాలన్నారు. ఆర్‌ఎంపీల సంఘం కమిటీ సభ్యులు కొమురవెల్లి ప్రశాంత్, శ్రీను, రాహుల్, లక్ష్మణ్, అఖిల్, గోవింద్, పురుషోత్తం, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో చేర్పించండి



చిన్నారుల వివరాలు సేకరిస్తున్న టీచర్

కెరమెరి: విద్యార్థులను ప్రభుత్వ బడుల్లో చేర్పించి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అన్నారు. బడిబాటలో భాగంగా సోమవారం మండలంలోని బడిబయట పిల్లలను గుర్తించారు. కొందరు అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి చిన్నారుల వివరాలు తెలుసుకొని నమోదు చేసుకున్నారు. ఇప్పటికీ బడికి వెళ్లనివారు, బడి మధ్యలో మానేసిన వారు, ప్రైవేటు పాఠశాల్లో చదివే విద్యార్థుల వివరాలనూ సేకరించారు. ఎంఎన్‌వో ఆడే ప్రకాశ్, కాంప్లెక్స్ హెచ్‌ఎం చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

ఇంటింటికీ తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న డీఎల్‌పీవో సురేశ్‌బాబు

కాగజ్‌నగర్‌రూరల్: ఇంటింటికీ తాగునీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డీఎల్‌పీవో సురేశ్‌బాబు ఆదేశించారు. సోమవారం వంజీరి రైతు వేదిక భవనంలో మిషన్ భగీరథ నీటి సరఫరాపై ప్రత్యేకంగా సమావేశాన్ని నిర్వహించారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో కొన్నిచోట్ల అంతరాయం ఏర్పడుతున్న నేపథ్యంలో సమస్యను పరిష్కరించే పనుల్లో భాగంగా ఇంటింటా సర్వే నిర్వహించాలన్నారు. ఎంపీడీవోలు రమేశ్, అల్బర్ట్, రాజేందర్, గంగాసింగ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

పకడ్బందీగా సర్వే చేయాలి

కౌటాల: నీటి సరఫరాపై ప్రతీ ఇంటి సర్వేను పకడ్బందీగా చేపట్టాలని డీపీవో భిక్షపతి గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో కౌటాల, సిర్పూర్(టి), చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాల డివిజన్ స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రతీ ఇంటికి బిగించిన మిషన్ భగీరథ నల్లాలు ఉన్నాయా అని ఇంటింటా సర్వే చేయాలన్నారు. ఐకేపీ, ఈజీఎస్, పంచాయతీ కార్యదర్శులు సంయుక్తంగా పది రోజుల్లో సర్వే చేయాలని ఆదేశించారు. ఎంపీడీవో నస్రుల్లాఖాన్, పాల్గొన్నారు.

అదుపుతప్పి లారీ బోల్తా



అదుపుతప్పి పడిపోయిన లారీ

జైనూర్: ఆదిలాబాద్ నుంచి కాగజ్‌నగర్‌కు ఎరువుల లోడ్ తీసుకొని వెళ్తున్న లారీ కెరమెరి ఘాట్ మూలమలుపు వద్ద అదుపుతప్పి పడిపోయిన ఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం అర్ధరాత్రి దాటిన సమయంలో ఆదిలాబాద్ నుంచి కాగజ్‌నగర్ ఎరువులు తీసుకెళ్తున్న లారీ కెరమెరి ఘాట్ మూలమలుపు వద్ద అదుపుతప్పి పడిపోయింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఎన్నో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా అధికారులు మాత్రం రోడ్డు విస్తరణ పనులు చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారి విస్తరణ చేపట్టి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు.

నాడీ పట్టేదెవరు..?



తిర్యాణిలోని ప్రభుత్వ ఆసుపత్రి

- పీహెచ్‌సీ, సీహెచ్‌సీకి ఒక్కడే వైద్యుడు
- సిబ్బంది లేక అందని వైద్యసేవలు
- నిరుపయోగంగా స్కానింగ్, ఎక్స్‌రే యంత్రాలు

తిర్యాణి: ఆదివాసీలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)తో పాటు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లను నిర్వహిస్తున్నారు. ఇవి 24 గంటల పాటు రోగులకు వైద్య సేవలు అందించాలి. కానీ క్షేత్రస్థాయిలో మౌలిక సదుపాయాలు లేకపోవడం, సిబ్బంది కొరత వేధిస్తుండటంతో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందడం లేదు.

ఒకే ఒక్కడు..

పీహెచ్‌సీ, సీహెచ్‌సీ కలిపి ఆసుపత్రిలో షిఫ్టుల వారీగా ఆరుగురు వైద్యులు వైద్య సేవలు అందించాల్సి ఉండగా ప్రస్తుతం ఒకేఒక్క వైద్యుడు ఉండటంతో అత్యవసర పరిస్థితుల్లో రోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆసుపత్రిలో ముగ్గురు వైద్యులు ఉండగా అందులో ఒకరు డెప్యూటేషన్‌పై వేరే ప్రాంతానికి వెళ్లగా, మరొకరు లాంగ్ లీవ్‌లో ఉన్నారు. దీంతో ఒక్క వైద్యుడితోనే 24 గంటలు ఆసుపత్రిని నిర్వహిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. రానున్నది వర్షాకాలం కావడం.. మండలంలోని అనేక గ్రామాలు మారుమూల ప్రాంతాల్లో ఉండటంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో వైద్య సిబ్బంది కొరత ఉంటే రోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని మండలవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది కొరత కారణంగా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించేందుకు కూడా ఆస్కారం లేకుండా పోయింది.



నిరుపయోగంగా ఉన్న స్కానింగ్ యంత్రం

నిరుపయోగంగా ఎక్స్‌రే, స్కానింగ్ యంత్రాలు..

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎక్స్‌రే, స్కానింగ్ సేవలు అందించడం కోసం రూ.లక్షలు వెచ్చించి ప్రభుత్వం దాదాపు మూడేళ్ల క్రితం సంబంధిత యంత్రాలను కొనుగోలు చేసింది. కానీ వాటి నిర్వహణ చేపట్టే సిబ్బంది లేకపోవడంతో ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా మారాయి. స్కానింగ్ యంత్రాన్ని అందుబాటులోకి తీసుకురావడం ద్వారా మండలంలోని గర్భిణులకు స్కానింగ్ సేవలు అందించే అవకాశం ఏర్పడుతుంది. ప్రస్తుతం మండల వాసులు స్కానింగ్ కోసం 60 కిలోమీటర్లు ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. రోడ్లు కూడా సరిగా లేకపోవడంతో గర్భిణులు స్కానింగ్ కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మార్చురీ సైతం లేకపోవడంతో పోస్టుమార్టం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

మస్తు కష్టమవుతుంది



స్కానింగ్ కోసం గుంతల రోడ్డుపై ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించడం మస్తు కష్టమవుతుంది. ఆసుపత్రిలో స్కానింగ్ మిషన్ ఉన్నా వాటిని నిర్వహించే వైద్యుడు లేక మూలకుపడ్డాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో స్కానింగ్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలి.

– మడావి పార్వతి, ఎదులపహాడ్

వైద్యులను నియమించాలి



మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కేవలం ఒకే వైద్యుడు ఉండటంతో అత్యవసర పరిస్థితుల్లో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రానున్న వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని నియమించాలి.

– ఆత్రం సంతోష్, సుంగాపూర్

ఉన్నతాధికారులకు నివేదించాం

మండలంలోని పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో సరిపడా వైద్య సిబ్బంది నియమించాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్‌తో పాటు ఇతర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఎక్స్‌రే మిషన్‌కు సంబంధించిన టెక్నీషియన్ ఆసుపత్రిలో లేకపోవడంతో మిషన్‌ను ఉపయోగించడం లేదు.

– కృష్ణ, వైద్యుడు, తిర్యాణి సీహెచ్‌సీ

యూనిఫాంలు అందజేత



లింగాపూర్: యూనిఫాం అందజేస్తున్న ఏపీఎం



కెరమెరి: పార్డలో..

లింగాపూర్: మండలకేంద్రంలో సోమవారం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సంబంధించిన 1241 జతల యూనిఫాంలను జాముల్‌ధరా, గౌతమ్‌గూడ, కన్నెపల్లితో పాటు వివిధ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు జగదాంబ మహిళా సమాఖ్య సభ్యుల ఆధ్వర్యంలో అందజేశారు. ఏపీఎం సదానంద్, సీసీ కైలాస్ జాదవ్, గణేశ్, స్వర్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

12న యూనిఫామ్‌లు అందించాలి

కెరమెరి: ఈ నెల 12 నుంచి పాఠశాలలు పునః ప్రారంభమవుతున్న సందర్భంగా అన్ని పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు యూనిఫామ్‌లు అందించాలని ఎంఎన్‌వో ఆడే ప్రకాశ్ అన్నారు. సోమవారం మండలంలోని కొఠారి, కల్లెగాం, రంగస్‌ఘాట్, ధనోరా తెలుగు, ఉర్దూ, పార్డా, ఝరి పాఠశాలలను ఆయన సందర్శించారు. వీవో సంఘ మహిళలు కుట్టిన ఏకరూప దుస్తులను పాఠశాలల హెచ్‌ఎంలకు అందించారు. మండలంలోని 80 శాతం యూనిఫామ్‌లు కుట్టడం పూర్తయ్యిందని, 12న వంద శాతం విద్యార్థులకు దుస్తులు అందించాలని పేర్కొన్నారు. వీవో సభ్యులు, సీసీలు, హెచ్‌ఎంలు ఉన్నారు.

కూలిపోయిన కల్వర్టు తొలగించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

పెంచికల్‌పేట్: కొండపల్లి నుంచి గొల్లవాడకు వెళ్లే రహదారిలోని ఒర్రెపై ఉన్న కూలిపోయిన కల్వర్టును తొలగించాలని గ్రామస్తులు పంచాయతీ ప్రత్యేక అధికారి తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గతేడాది కురిసిన భారీ వర్షాలకు కల్వర్టు కొట్టుకుపోయిందన్నారు. దీంతో కల్వర్టు వద్ద నుంచి పశువులు మేతకు వెళ్తున్న సమయంలో కల్వర్టులో పడిపోతున్నాయని పేర్కొన్నారు. అధికారులు స్పందించి కూలిపోయిన కల్వర్టు పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేశారు. గ్రామస్తులు లచ్చన్న, రవి, మధు, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పనుల్లో అవకాశం కల్పించాలి

రెబ్బెన: ఏరియాలోని భూ నిర్వాసితులకు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పనుల్లో పనులు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని హెచ్‌ఎంఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు కోరారు. ఈ మేరకు సోమవారం ఏరియా జనరల్ మేనేజర్ రవి ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఏరియాలో ఓసీపీ విస్తరణలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఔట్‌సోర్సింగ్ పనుల్లో పనులు కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు శంకరమ్మ, తులసీరాం, లక్ష్మణ్, పార్వతి, నాగరాణి, రాజేశ్వరి పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న రాజాబాబు

'టెండర్ కాంట్రాక్ట్ కింద వేతనాలు సరికాదు'



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జ్యోతిబా పూలే వసతిగృహం వర్కర్లకు టెండర్ కాంట్రాక్టు కింద వేతనాలిచ్చే విధానం సరికాదని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు లోకేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం ఏవో రఫత్‌కు వినతిపత్రం అందించారు. లోకేశ్ మాట్లాడుతూ జ్యోతిబా పూలే వసతిగృహం కార్మికులను ప్రభుత్వం కాంట్రాక్ట్ లేదా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాదబీమా, ఉద్యోగ భద్రత వంటి సౌకర్యాలకు నోచుకోవడం లేదన్నారు. గత ప్రభుత్వ తప్పుడు నిర్ణయంతో కార్మికులు కుటుంబాలను పోషించుకోలేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బాలేశ్, తదితరులు ఉన్నారు.

రహదారిపైనే పార్కింగ్



పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాతో పాటు ఇతర ప్రాంతాల్లో రోడ్లపైనే ద్విచక్రవాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. ప్రధాన రహదారిని ఆనుకొని వ్యాపార సముదాయాలు ఉండడంతో వివిధ అవసరాల నిమిత్తం వచ్చిన వారు రోడ్లపైనే వాహనాలను నిలుపుతున్నా రు. ఆర్టీసీ బస్సులు, ఎరువుల లారీలు, ఇతర వాహనాలను సైతం రోడ్డుపైనే నిలుపుతుండడంతో మండల కేంద్రానికి వచ్చే ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో రోడ్డుకి ఆనుకొని ఉన్న నిర్మాణాలను తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఉద్యోగులకు బదిలీలు సహజం



సన్మానిస్తున్న మెస్రం రాహుల్

జైనూర్: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని జామ్ని తాజా మాజీ సర్పంచి మెస్రం రాహుల్ అన్నారు. సోమవారం బదిలీపై వెళ్తున్న భారతీయ స్టేట్ బ్యాంకు మేనేజర్ గోపాకృష్ణకు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీలతో మమేకమై బ్యాంకు రుణాలపై క్షుణ్నంగా అవగాహన కల్పించారని కొనియాడారు.

మట్టిలోనే విత్తుతున్నారు..!



విత్తనాలు వేస్తున్న కూలీలు

- మృగశిర సెంటిమెంట్
- ఇప్పటికే 30శాతం సోయింగ్ పూర్తి
- వానల కోసం అన్నదాతల నిరీక్షణ

కెరమెరి: వానల జాడలేక మండలంలోని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏరువాక పున్నమి తర్వాత అనేక మంది రైతులు పొలాన్ని చదును చేసి, నేలలో తడి లేకున్నా మట్టిలో విత్తనాలు వేశారు. ఏరువాక రోజుల్లో వర్షాలు కురుస్తాయని ఆశించిన అన్నదాతలకు నిరాశే మిగులుతోంది. ఇప్పటికీ రైతులు విత్తనాలు విత్తాల్సి ఉన్నప్పటికీ ఒక్క వాన కూడా పడకపోవడంతో ఏంచేయాలో తోచడం లేదని రైతులు మదన పడుతున్నారు. పదన కనిపించక పోయినా పత్తి విత్తనాలు వేస్తున్నారు.

30శాతం పూర్తి..

మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో 156 గ్రామాలు ఉన్నాయి. అందులో 90 శాతం మంది రైతులు ఉన్నారు. మృగశిర కార్తెలో విత్తనాలు నాటాలని సెంటిమెంట్‌తో వానలు కురవకున్నా మండలంలో 30శాతం మంది రైతులు ఇప్పటికే విత్తనాలు విత్తారు. మరికొందరు వానలు కురిశాక విత్తనాలు నాటాలని ఎదురుచూస్తున్నారు. నీటి సౌకర్యం ఉన్న రైతులు విత్తనాలు వేసి స్ప్రింక్లర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. ప్రతీ రోజు ఉదయం, సాయంకాలం నీటిని విడుదల చేస్తున్నారు. కాగా విద్యుత్ కోతలు అధికం కావడంతో వారికి కూడా ఇబ్బందులు తప్పడం లేదు.



స్ప్రింక్లర్లతో నీటిని అందిస్తున్న రైతు

26వేల ఎకరాల్లో పత్తి సాగు..

మండలంలో మొత్తం 8,194 మంది రైతులు ఉండగా, ఇందులో 26,160 ఎకరాల్లో పత్తి సాగు చేస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే 710 ఎకరాల్లో పత్తి విత్తనాలు విత్తారు. గతంలో పోలిస్తే ఈ సారి వానలు లేకపోవడంతో చాలామంది రైతులు విత్తనాలు వేసేందుకు ముందుకు రావడం లేదు. ఎండలు కూడా మండిపోతుండడంతో విత్తనాలు మాడిపోతాయన్న భయం వారిలో నెలకొంది.

మట్టిలోనే..



మృగశిరలో విత్తనాలు విత్తితే మంచిదని అందరూ చెబుతున్నారు. అందుకే వానలు కురవకున్నా మట్టిలోనే విత్తనాలు విత్తుతున్నాం. మరో నాలుగు రోజుల్లో వానలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలపడంతో విత్తనాలు మొలకెత్తుతాయని ఆశ ఉంది.

– కేంద్రే బాలాజీ, ధనోరా

మొలకశాతం తగ్గుతుంది



వర్షాలు పడకముందే విత్తనాలు నాటితే మొలక శాతం తగ్గుతుంది. వేడికి విత్తనాలు నిర్జీవమయ్యే అవకాశం ఉంది. అందుకు ఒకటి, రెండు సార్లు వానలు కురిసిన తర్వాతనే విత్తనాలు విత్తాలి. రైతులు వ్యవసాయాధికారుల సలహాలు తీసుకోవాలి.

– ఎన్. గోపీకాంత్, ఎంఏవో, కెరమెరి

పొంచి ఉన్న ప్రమాదం



కెరమెరి: మండలంలోని ఇందాపూర్‌కు వెళ్లే దారిలో ఇంద్రానగర్ గ్రామ సమీపంలో ఉన్న సీసీరోడ్డు పూర్తిగా కోతకు గురై ప్రమాదకరంగా మారింది. రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. గత రెండేళ్ల నుంచి పరిస్థితి ఇలాగే ఉన్నా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థికి సన్మానం



సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు



తల్లిదండ్రులతో తరుణ్

వాంకిడి: జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో ఆల్ ఇండియా స్థాయిలో 1782వ ర్యాంకు సాధించి ఉత్తమ ప్రతిభ కనబర్చిన దుర్గం అర్జున్‌ను పీఆర్టీయూ టీఎస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు, అంబేద్కర్ సంఘం నాయకులు సోమవా రం సన్మానించారు. ఎంఈవో మనుకుమార్, పీఆర్టీయూ టీఎస్ మండల అధ్యక్షుడు ఉప్రే వి నేష్, కార్యదర్శి జగదీష్, జెడ్పీఎస్ఎస్ హెచ్‌ఎం నటరాజ్, అంబేద్కర్ సంఘం నాయకులు అశోక్ మహోల్కర్, సునీల్ దుర్గే, విజేయ్ ఉప్రె, శ్యాంరావు దుర్గె, ప్రతాప్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని పీటీజీ కళాశాలలో చదివిన తరుణ్ జేఈఈలో సత్తా చాటినట్లు ప్రిన్సిపాల్ సురేశ్ సోమవారం తెలిపారు. కౌటాల మండలంలోని లంబాడహెట్టి గ్రామానికి చెందిన సాలిబాయి –వల్యానాయక్ దంపతుల కుమారుడు బానోత్ తరుణ్ జేఈఈలో మంచి మార్కులతో 652 ర్యాంక్ సాధించినట్లు పేర్కొన్నారు.

ఘనంగా మొహుతుర్ పండుగ

నార్నూర్: గాదిగూడ మండలంలోని పలు గిరిజన గ్రామాలలో సోమవారం మొహుతుర్ పండుగను ఆదివాసీ గిరిజనులు ఘనంగా జరుపుకున్నారు. ఆదివాసీ ఆచారం ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయా గ్రామాలకు సంబంధించిన మహిళలు సాంస్కృతిక నృత్యాలు చేశారు. పూజ చేసిన అనంతరం ఖరీఫ్ సాగు పనులు ప్రారంభిస్తామని ఆదివాసీలు పేర్కొన్నారు.